# తొలివెలుగు

జాతీయ దిన పత్రిక

మన భాష.. మన పత్రిక..

https://tholivelugu.com/

హైదరాబాద్ సంపుటి:01 సంచిక: 162 27-6-2026 వెల: రూ.2/- పేజీలు: 06



విలేకరులు కావలెను

తొలివెలుగు జాతీయ దిన పత్రిక మన భాష.. మన పత్రిక..

www.epaper.tholivelugu.com

Contacts

తెలంగాణ

94911 34365

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో

తొలివెలుగు జాతీయ తెలుగు దినపత్రికలో పలు విభాగాల్లో పనిచేయుటకు ఉత్సాహవంతులైన స్టేట్ బ్యూరో, జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు, మండల రిపోర్టర్లు కావలెను. ఆసక్తి.. అనుభవం గల వారు సంప్రదించగలరు.


## రేపు మార్కాపురం జిల్లాకు సీఎం చంద్రబాబు..

- శనివారం మార్కాపురం జిల్లాలో పర్యటించనున్న సీఎం చంద్రబాబు
- వెలిగొండ ప్రాజెక్ట్ ఫీడర్ కెనాల్ పనుల క్షేత్రస్థాయి పరిశీలన
- ప్రాజెక్ట్ నిర్వాసితులకు పరిహారం చెక్కుల పంపిణీ, వారితో సమావేశం
- గిద్దలూరులో సంజీవిని ఆసుపత్రి ప్రారంభోత్సవంలో పాల్గొననున్న ముఖ్యమంత్రి
- సీఎం పర్యటన సందర్భంగా జిల్లాలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు




ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు శనివారం (జూన్ 2) మార్కాపురం జిల్లాలో పర్యటించనున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఆయన కీలకమైన వెలిగొండ ప్రాజెక్ట్ ఫీడర్ కెనాల్ పనులను పరిశీలించడంతో పాటు, పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. సీఎం పర్యటనకు సంబంధించి జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లను పూర్తి చేసింది. వివరాల్లోకి వెళితే, శనివారం ఉదయం 9:55 గంటలకు హైదరాబాద్ నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరనున్న సీఎం చంద్రబాబు, 10:45 గంటలకు మార్కాపురం

2లో



## మూసీ నిర్వాసితులకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు

- సమీక్షలో సీఎం రేవంత్, మంత్రి పొంగులేటి
- నెక్లెస్ రోడ్డులో మూసీ ఎక్స్‌పీరియన్స్ సెంటర్
- అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం
- మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టుపై సమీక్ష



## ఏపీలో రేపటి నుంచి భారీ వర్షాలు.. ఏపీఎస్డీఎంఏ అలర్ట్

- వాతావరణ మార్పుల ప్రభావంతో ఏపీలో రేపటి నుంచి భారీ వర్షాలు
- ఉరుములు, మెరుపులతో పాటు గంటకు 40-50 కి.మీ వేగంతో గాలులు
- పలు కోస్తా, రాయలసీమ జిల్లాల్లో రానున్న రెండు రోజులు వర్ష ప్రభావం
- ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని అధికారుల సూచన



## రాహుల్ గాంధీపై 'మిస్సింగ్' పోస్టర్లు...

- బీజేపీ, కాంగ్రెస్ మధ్య మాటల యుద్ధం
- రాహుల్ గాంధీ విదేశీ పర్యటనలే లక్ష్యంగా బీజేపీ విమర్శలు
- 'లాపతా రాహుల్' పేరుతో సామాజిక మాధ్యమాల్లో పోస్టర్లతో క్యాంపెయిన్
- రాహుల్ టూర్ల ఖర్చుపై అనుమానాలు వ్యక్తం చేస్తున్న కమలదళం
- రాహుల్ ప్రపంచస్థాయి నాయకుడని కాంగ్రెస్ కౌంటర్

2లో

## ఏపీ సీనియర్ ఐఏఎస్ శ్రీలక్ష్మికి పోస్టింగ్.. రిటైర్మెంట్‌కు ముందు పోస్టింగ్ అందుకేనా?

2లో

- పదవీ విరమణకు నాలుగు రోజుల ముందు ఐఏఎస్ శ్రీలక్ష్మికి పోస్టింగ్
- స్పెషల్ చీఫ్ సెక్రటరీగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు
- రెండేళ్లుగా పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న శ్రీలక్ష్మికి ఊరట
- కక్ష సాధింపులు ఉండవనే సంకేతాలు పంపిన ప్రభుత్వం
- గౌరవప్రదమైన పదవీ విరమణకు అవకాశం కల్పించిన సర్కార్



## పంచాయతీరాజ్ శాఖలో ప్రమోషన్ల పండగ..

- కీలక ఆదేశాలు జారీ చేసిన పవన్
- పంచాయతీ రాజ్‌శాఖలో మరోసారి ప్రమోషన్లు
- 42 మంది ఎంపీడీవోలకు డీడీవోలుగా పదోన్నతులు
- కూటమి ప్రభుత్వం వచ్చాక 10 వేల మందికి ప్రమోషన్లు
- వర్షాకాలంపై అధికారులతో డిప్యూటీ సీఎం పవన్ సమీక్ష
- సీజనల్ వ్యాధుల నివారణకు ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశం

2లో

## కాంగ్రెస్ పాలనలో ప్రజలకు నరకం

- వచ్చే ఎన్నికల్లో కేసీఆర్ సీఎం కావడం ఖాయం: కేటీఆర్
- పరిగిలో పార్టీ శ్రేణులకు 'సర్'పై అవగాహన

పరిగి: 'మోసపోతే గోస పడుతామని పరిగి గడ్డపై నిలబడి కేసీఆర్ ఆనాడే చెప్పారు. ఇప్పుడు కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ప్రజలు నరకం





## తుంగభద్ర జలాలు రేవంత్ సర్కార్‌పై రాంచందర్ రావు ఫైర్

- తుంగభద్ర నీటి వాటాపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టత ఇవ్వాలన్న బీజేపీ
- తెలంగాణకు రావాల్సిన నీటిలో భారీగా కోత పడుతోందన్న రామచందర్ రావు
- సర్ ప్రక్రియపై అసదుద్దీన్ ఒవైసీ చేసిన వ్యాఖ్యల మీద విమర్శ

తుంగభద్ర ప్రాజెక్టు నుంచి తెలంగాణకు కేటాయించిన నీటి వాటాపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టతనివ్వాలని



## కెమెరాలు కవర్ చేసి.. అందినంత కొట్టేసి..

- అయోధ్య విరాళాల స్కామ్ జరిగిన తీరిది
- ఆలయ లెక్కింపు గదిలో సిబ్బంది చేతి వాటం
- బ్యాంకులకు తరలించేటప్పుడూ దొంగతనం
- బాత్‌రూమ్‌లో దాచి ఆ తర్వాత ఎత్తుకెళ్లిన వైనం
- రూ.7.75 కోట్ల అవకతవకలు జరిగినట్టు అనుమానం!

2లో

# శిథిలాల కింద 45,000 మంది?



- వెనెజువెలాలో కొనసాగుతున్న సహాయక చర్యలు
- 590కి పెరిగిన భూకంప మృతుల సంఖ్య
- 3,360 మందికి గాయాలు
- ఆత్మీయుల జాడ కోసం అనేక మంది అన్వేషణ
- ఆపరేషన్ అమిస్తాద్‌తో భారత్ ఆపన్నహస్తం

# మూసీ నిర్వాసితులకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు

హైదరాబాద్: మూసీ పరీవాహక ప్రాంతంలో ఉన్న వారికి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీ బోధి పెవిలియన్‌లో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీ వేం నరేందర్‌రెడ్డిలతో కలిసి మూసీ రివర్ ఫ్రంట్‌పై సీఎం సమీక్ష నిర్వహించారు. మూసీ మొదటి దశ ప్రాజెక్టుపై సుదీర్ఘంగా చర్చించారు. భూ సేకరణ కోసం ఆసక్తిగా ఉన్న వారికి టీడీఆర్ లేదా పరిహారం చెల్లించాలని రేవంత్ చెప్పారు. గాంధీ సరోవర్ ప్రాజెక్టు కోసం తీసుకుంటున్న రక్షణ శాఖ భూముల్లో ఉన్న కార్యాలయాలను రాష్ట్ర ప్రభుత్వమే తరలించాలన్నారు. ప్రజల సందర్శన కోసం నెక్లెస్ రోడ్డులో మూసీ ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మూసీ ప్రాజెక్టులో చేపట్టబోయే పనులు ఇందులో ప్రతిబింబించాలని అన్నారు. ప్రాజెక్టుపై ప్రజల అభిప్రాయాలను తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు ఎండీ నర్సింహారెడ్డి, ఎంఆర్డీసీఎల్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ గౌతమి, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, సీఎంఓ కార్యదర్శి మాణిక్ రాజ్, మునిసిపల్ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# రేపు మార్కాపురం జిల్లాకు సీఎం చంద్రబాబు..

జిల్లా పెద్దదోర్నాల మండలం గంటవానిపల్లె గ్రామానికి చేరుకుంటారు. అక్కడ అధికారులు, ప్రజాప్రతినిధులతో కొద్దిసేపు సమావేశమైన అనంతరం, ఉదయం 11 గంటలకు వెలిగొండ ప్రాజెక్ట్ ఫీడర్ కెనాల్ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తారు. పనుల పురోగతి, నాణ్యతపై అధికారులతో సమీక్ష నిర్వహిస్తారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ నిర్వాసితులకు ఆయన పరిహారం చెక్కులను పంపిణీ చేస్తారు. అనంతరం మధ్యాహ్నం 12:20 వరకు నిర్వాసితులతో ప్రత్యేకంగా సమావేశమై వారి సమస్యలు, ఇబ్బందులను అడిగి తెలుసుకుంటారు. ఆ తర్వాత మధ్యాహ్నం 12:55 గంటలకు గిద్దలూరు నియోజకవర్గంలోని కిష్టంశెట్టిపల్లె గ్రామానికి చేరుకుంటారు. అక్కడ నూతనంగా ఏర్పాటు చేసిన సంజీవిని ఆసుపత్రిని ప్రారంభించి, వైద్యులు, సిబ్బందితో సమావేశమవుతారు. ఆసుపత్రి ప్రారంభోత్సవం అనంతరం జరిగే బహిరంగ సభలో సీఎం ప్రసంగిస్తారు. ఆ తర్వాత స్థానిక ప్రజలు, ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులతో 'గార్డెన్ మీటింగ్'లో పాల్గొని అభివృద్ధి అంశాలపై చర్చిస్తారు. సాయంత్రం 5:15 గంటలకు అక్కడి నుంచి హెలికాప్టర్‌లో గుంటూరుకు తిరుగుపయనమవుతారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆధ్వర్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా భారీ పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశారు.

# శిథిలాల కింద 50,000 మంది?

(మొదటి పేజీ తరువాయి)

40 వేల మంది గల్లంతు.. వెనెజువెలా భూకంపంలో 589కి చేరిన మృతుల సంఖ్య వెనెజువెలాలో సంభవించిన జంట భూకంపాల్లో మృతులు, గాయపడినవారు, గల్లంతైనవారి సంఖ్య అంతకంతకూ పెరుగుతోంది. ఈ విపత్తులో ఇప్పటివరకూ 589 మంది మృతి చెందారని, 4,300 మంది గాయపడ్డారని ఆ దేశ ఆరోగ్య శాఖ శుక్రవారం తెలిపింది.

**40 వేల మంది గల్లంతు.. వెనెజువెలా భూకంపంలో 589కి చేరిన మృతుల సంఖ్య**

కారకాస్: వెనెజువెలాలో సంభవించిన జంట భూకంపాల్లో మృతులు, గాయపడినవారు, గల్లంతైనవారి సంఖ్య అంతకంతకూ పెరుగుతోంది. ఈ విపత్తులో ఇప్పటివరకూ 589 మంది మృతి చెందారని, 4,300 మంది గాయపడ్డారని ఆ దేశ ఆరోగ్య శాఖ శుక్రవారం తెలిపింది. భవనాల శిథిలాల కింద చాలా మంది చిక్కుకుపోయారని, 40 వేల మందికిపైగా ప్రజల జాడ తెలియడంలేదని పేర్కొంది. భూకంపానికి తీవ్రంగా ప్రభావితమైన లాగువేరాలో పరిస్థితి దయనీయంగా ఉందని వివరించింది. ఇక్కడ వందకుపైగా భారీ భవనాలు నేలమట్టమైనట్లు ఐక్యరాజ్య సమితి ప్రతినిధులు వెల్లడించారు.

**'ఆపరేషన్ అమిస్టాడ్' పేరుతో భారత్ సాయం**

జంట భూకంపాలతో అతలాకుతలమైన వెనెజువెలాను ఆదుకునేందుకు 'ఆపరేషన్ అమిస్టాడ్' పేరుతో భారత్ సహాయక చర్యలు కొనసాగిస్తున్నదని విదేశాంగమంత్రి ఎస్ జై శంకర్ తెలిపారు. దీనిలో భాగంగా సహాయక చర్యలకు అవసరమైన సామగ్రితో భారత్ సైన్యానికి చెందిన రెండు సీ17 విమానాలు బయలుదేరినట్లు చెప్పారు. సైన్యానికి చెందిన ఫీల్డ్ హాస్పిటల్ యూనిట్ క్షతగాత్రులకు చికిత్స అందించేందుకు రెండు మొబైల్ ఆస్పత్రి టెంట్లు, 25 టన్నులకుపైగా సహాయక సామగ్రి పంపినట్లు తెలిపారు.

**శిథిలాల్లో శిశువు జననం**

భూకంపం సంభవించిన లాగువైరా ప్రాంతంలో శిథిలాల్లో చిక్కుకున్న ఒక మహిళ శిశువుకు జన్మనిచ్చింది. రెండు రోజుల పాటు భవనపు శిథిలాల్లో చిక్కుకుపోయిన ఆమెను రెస్క్యూ సిబ్బంది బయటకు తీసుకువచ్చారు. స్థానికులు ఆ శిథిలాల్లోనే ఆమెకు పురుడు పోశారు. దీనికి సంబంధించిన వీడియోను చూసిన వారంతా కంట తడి పెట్టుకుంటున్నారు.

# రాహుల్ గాంధీపై 'మిస్సింగ్' పోస్టర్లు...

ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ తరచూ చేపడుతున్న విదేశీ పర్యటనలను లక్ష్యంగా చేసుకుని బీజేపీ తీవ్ర విమర్శలు గుప్పిస్తోంది. ఈ మేరకు 'మిస్సింగ్ రాహుల్ (లాపతా రాహుల్)' పేరుతో సరికొత్త పోస్టర్ ప్రచారాన్ని ప్రారంభించింది. ఆయన పర్యటనల కోసం చేస్తున్న ఖర్చులపై ప్రశ్నలు సంధిస్తూ సామాజిక మాధ్యమాల్లో ఈ క్యాంపెయిన్‌ను ఉద్ధృతం చేసింది. ఈ ప్రచారంలో భాగంగా పలు సినిమా పోస్టర్లను మార్ఫింగ్ చేస్తూ బీజేపీ నేతలు సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తున్నారు. "ఛడ్ దే ఇండియా", "రాహుల్ ఇన్ పారిస్", "పరదేశ్" వంటి పేర్లతో వ్యంగ్యాస్త్రాలు సంధిస్తున్నారు. ప్రతిపక్ష నాయకుడి హోదాను 'పర్యటనల నేత'గా మార్చాలని కొందరు బీజేపీ అధికార ప్రతినిధులు ఎద్దేవా చేశారు. ఢిల్లీ బీజేపీ యూనిట్ "స్వదేశ్ వర్సెస్ పరదేశ్" పేరుతో పోస్టర్ విడుదల చేయగా, గోవా బీజేపీ రాహుల్ గాంధీ థాయ్‌లాండ్‌లో విహారయాత్ర చేస్తున్నారా? అంటూ ప్రశ్నించింది. బీజేపీ నేతలు షెహజాద్ పూనావాలా, ఆర్పీ సింగ్ వంటి వారు రాహుల్ పర్యటనల ఖర్చు, పారదర్శకతపై తీవ్ర ఆరోపణలు చేశారు. రాహుల్ గాంధీ ఇప్పటివరకు సుమారు 55 సార్లు విదేశీ పర్యటనలు చేశారని, వీటికి దాదాపు రూ.60 కోట్లకు పైగా ఖర్చయి ఉండవచ్చని వారు అంచనా వేశారు. ఆయన వెల్లడించిన ఆదాయానికి, ఈ పర్యటనల ఖర్చులకు ఏమాత్రం పొంతన లేదని, ఈ పర్యటనలకు నిధులు ఎక్కడి నుంచి వస్తున్నాయో బహిర్గతం చేయాలని వారు డిమాండ్ చేశారు. అయితే, బీజేపీ చేస్తున్న విమర్శలను కాంగ్రెస్ పార్టీ అంతే ధీటుగా తిప్పికొట్టింది.

# కెమెరాలు కవర్ చేసి.. అందినంత కొట్టేసి..

(మొదటి పేజీ తరువాయి)

అయోధ్య: అయోధ్య రామ మందిరం విరాళాల్లో అవతకతవకల కేసులో రోజుకో కొత్త కోణం బయటకొస్తోంది. సిట్ నివేదిక ప్రకారం నిందితులు డబ్బులు, కానుకలు ఎలా దొంగిలించారో కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. విరాళాలను లెక్కించే సిబ్బందిలో ఒకరు సీసీ కెమెరాలకు అడ్డంగా నిలబడగా.. మరొకరు డబ్బులను దొంగిలించి తన లోపలి దుస్తుల్లో దాచుకున్నాడని.. ఇలా కోట్లాది రూపాయలు మిస్ అయినట్టు సిట్ నివేదికలో వెల్లడైంది. అధికారులు జాతీయ మీడియాకు ఇచ్చిన సమాచారం ప్రకారం.. విరాళాల బ్యాంకు వివరాలను సమీక్షించినప్పుడు ట్రస్టు అధికారులకు అనుమానం వచ్చింది. సాధారణంగా ఒక విరాళాల పెట్టెలో రూ.6 లక్షల నుంచి రూ.7 లక్షల వరకు ఉంటాయి. అయితే కొన్ని పెట్టెల్లో మాత్రం రూ.500 నోట్ల కట్టలు తక్కువగా ఉండటాన్ని అధికారులు గమనించి లెక్కింపు గదిలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. అక్కడ ఒక వ్యక్తి సీసీ కెమెరాలకు కొన్ని వారాల పాటు అడ్డంగా నిలబడటం అధికారులు గుర్తించారు. అలా నిలబడ్డప్పుడు మరో ఉద్యోగి డబ్బులను తన దుస్తుల్లో దాచుకునేవాడు. ఇలా కోట్ల రూపాయలు దోచేశారు.

**బ్యాంకుకు తరలించేటప్పుడు..**

కేవలం లెక్కింపు గదిలోనే కాకుండా ఇంకో విధంగా కూడా విరాళాలు పక్కదారి పట్టినట్టు సిట్ దర్యాప్తులో తేలింది. కౌంటింగ్ స్టాఫ్ నోట్ల కట్టల్లో ఉండాల్సిన దాని కంటే ఎక్కువ నోట్లను చొప్పించేవారు. బ్యాంకులకు తరలించే క్రమంలోనే సిబ్బంది ఆ కట్టల నుంచి ఎక్కువగా ఉన్న నోట్లను తీసుకునేవారు. అప్పుడు వోచర్లకు సరిపడా మొత్తం బ్యాంకులో జమ అయ్యేది.

# తుంగభద్ర జలాలు రేవంత్ సర్కార్‌పై రాంచందర్ రావు ఫైర్

రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు రాంచందర్ రావు డిమాండ్ చేశారు. ఇటీవల కేంద్ర జలశక్తి మంత్రి సి.ఆర్. పాటిల్‌తో జరిగిన చర్చల్లో ఏయే అంశాలను ప్రస్తావించారో వివరాలను బహిర్గతం చేయాలని ఆయన కోరారు. శుక్రవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. కర్ణాటకలోని హోసపేటలో ఉన్న తుంగభద్ర డ్యామ్‌కు ఇటీవల 33 కొత్త స్పిల్‌వే గేట్లను అమర్చిన విషయం తెలిసిందే. ఈ కార్యక్రమానికి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక ముఖ్యమంత్రులతో పాటు కేంద్ర మంత్రి సి.ఆర్. పాటిల్ హాజరయ్యారు. గేట్ల ఏర్పాటును స్వాగతిస్తున్నామని, అయితే తెలంగాణకు దక్కాల్సిన నీటి కేటాయింపులపై కాంగ్రెస్ ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరించాలని రామచంద్రరావు సూచించారు. రెండు కీలక ప్రాజెక్టుల కింద తెలంగాణకు 15.9 టీఎంసీల నీరు రావాల్సి ఉండగా, అధికారిక లెక్కల ప్రకారం కేవలం 5 టీఎంసీలు మాత్రమే అందుతున్నాయని, దీనివల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రానికి దక్కాల్సిన వాటా కంటే తక్కువ నీటికి గతంలో కేసీఆర్ సంతకం చేశారని ఆయన ఆరోపించారు. 'సర్' ప్రక్రియపై హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ చేసిన



వ్యాఖ్యలను రామచందర్ రావు తీవ్రంగా ఖండించారు. బీజేపీ ఐడీ కార్డు ఉంటేనే 'ఎస్ఐఆర్' చెల్లుతుందా? పాస్‌పోర్ట్ చెల్లదా? అని ఒవైసీ ప్రశ్నించడం విడ్డూరంగా ఉందన్నారు. పాస్‌పోర్ట్ అనేది ట్రావెల్ డాక్యుమెంట్ మాత్రమేనని, అది పౌరసత్వానికి నిరూపణ కాదని 2013లో బాంబే హైకోర్టు ఇచ్చిన తీర్పును ఈ సందర్భంగా గుర్తు చేశారు. దలైలామా వద్ద కూడా ఎల్లో పాస్‌పోర్ట్ ఉందని, అంతమాత్రాన ఆయనకు భారత పౌరసత్వం ఉన్నట్లు కాదని పేర్కొన్నారు. 'సర్' ప్రక్రియలో గుర్తింపు కోసం 12 రకాల ధృవీకరణ పత్రాలను సమర్పించే అవకాశం ఉందని ఆయన స్పష్టం చేశారు.

# రిటైర్మెంట్‌కు ముందు పోస్టింగ్ అందుకేనా?

సీనియర్ ఐఏఎస్ అధికారిణి శ్రీలక్ష్మి విషయంలో ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. మరో నాలుగు రోజుల్లో పదవీ విరమణ చేయనున్న ఆమెను స్పెషల్ చీఫ్ సెక్రటరీగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. గత రెండేళ్లుగా ఎలాంటి పోస్టింగ్ లేకుండా నిరీక్షిస్తున్న ఆమెకు ఈ నియామకంతో ప్రభుత్వం ఊరట కల్పించింది. ఈ నిర్ణయంతో ఆమె తన సర్వీస్‌ను గౌరవప్రదంగా ముగించేందుకు మార్గం సుగమమైంది. అఖిల భారత సర్వీస్ నిబంధనల ప్రకారం ఒక అధికారి సస్పెన్షన్‌లో లేనప్పుడు, పదవీ విరమణకు ముందు వారికి ఏదో ఒక పోస్టింగ్ ఇచ్చి గౌరవంగా పంపించాల్సి ఉంటుంది. ఈ నిబంధనను పాటిస్తూ ప్రభుత్వం శ్రీలక్ష్మికి పోస్టింగ్ ఇచ్చింది. తద్వారా తమ ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడదని, నిబంధనల ప్రకారమే నడుచుకుంటుందని అధికారులకు స్పష్టమైన సంకేతాలు పంపింది. ఈ నిర్ణయం అధికార వర్గాల్లో ప్రభుత్వంపై సానుకూల దృక్పథాన్ని పెంచే అవకాశం ఉంది.

ఒక అధికారి పదవిలో ఉండి రిటైర్ అవడానికి, పోస్టింగ్ లేకుండా రిటైర్ కావడానికి మధ్య చాలా వ్యత్యాసం ఉంటుంది. పదవిలో ఉండి రిటైర్ అయితే, పదవీ విరమణ తర్వాత లభించే ప్రయోజనాలు, పెన్షన్, నో-డ్యూ సర్టిఫికెట్లు పొందడం సులభతరం అవుతుంది. అదే పోస్టింగ్ లేకుండా రిటైర్ అయితే, ఆర్థికంగా పెద్ద నష్టం లేకపోయినా ఈ పత్రాల కోసం నెలల తరబడి కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తుంది. ఇది అధికారికి వృత్తిపరంగా అవమానకరంగా ఉంటుంది. ఒకవేళ అధికారిపై తీవ్రమైన అవినీతి లేదా క్రిమినల్ ఆరోపణలు ఉండి, సస్పెన్షన్‌లో ఉండగా రిటైర్ అయితే పరిస్థితి మరింత క్లిష్టంగా ఉంటుంది. వారికి పూర్తి స్థాయి పెన్షన్ లభించదు, కేవలం తాత్కాలిక పెన్షన్ మాత్రమే అందుతుంది. శాఖాపరమైన విచారణ లేదా కోర్టు తీర్పులో నిర్దోషిగా తేలేంత వరకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ నిలిచిపోతాయి.

# కాంగ్రెస్ పాలనలో ప్రజలకు నరకం

చూస్తున్నారు'అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె. తారక రామారావు అన్నారు. మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం వికారాబాద్ జిల్లా పరిగిలో 'సర్'పై నిర్వహించిన శిక్షణ, పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసైన్డ్ రైతులకు పట్టాలిస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చిన రేవంత్.. ఇప్పుడు పారిశ్రామిక పార్కుల పేరిట వేలాది ఎకరాలు లాక్కుంటున్నారని ఆరోపించారు. పంటలకు బోనస్ ఇస్తామని చెప్పి కనీసం ధాన్యం కూడా పూర్తిగా కొనలేకపోతున్నారని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆరిపోయే దీపం లాంటివారని ఎద్దేవా చేశారు. రైతుల పక్షాన నిలబడి పోరాడుతున్న బీఆర్ఎస్ నాయకులపై అక్రమంగా కేసులు పెట్టి అరెస్టులు చేస్తే సహించేది లేదని అధికారులను హెచ్చరించారు.

**కమీషన్ల కోసమే లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్..**

పాలమూరు--రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని బీఆర్ఎస్ హయాంలో 90 శాతం పూర్తి చేశామని.. కానీ రెండున్నరేళ్లుగా అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతులపై ప్రేమ ఉంటే ఎందుకు పూర్తి చేయలేదని కేటీఆర్ నిలదీశారు. ఉద్దండాపూర్ నుంచి గ్రావిటీ ద్వారా వికారాబాద్ జిల్లాకు కాల్వల ద్వారా నీటిని తీసుకురావచ్చని సిద్ధం చేస్తే సీఎం, మంత్రులు, ఎమ్మెల్యేలు కమీషన్లు, కుటుంబ సంపాదన కోసం రూ. 440 కోట్ల లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును పక్కన పెట్టారని దుయ్యబట్టారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో మళ్లీ బీఆర్ఎస్ అధికారంలోకి రావడం, కేసీఆర్ సీఎం కావడం ఖాయమని.. రైతులకు పరిగితోపాటు కొడంగల్, జిల్లా మొత్తానికి సాగు నీరు అందించే బాధ్యత బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకుంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు మెతుకు ఆనంద్, పార్టీ నేతలు అనిల్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, శివనోళ్ల భాస్కర్, రాజిరెడ్డి, సురేందర్, అశోక్‌కుమార్, మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

# ఏపీలో రేపటి నుంచి భారీ వర్షాలు.. ఏపీఎస్డీఎంఏ అలర్ట్

వాతావరణ మార్పుల ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లో రేపటి (శనివారం) నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ (ఏపీఎస్డీఎంఏ) వెల్లడించింది. విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ స్పందిస్తూ... రేపు ఉత్తరాంధ్ర, కాకినాడ, కోనసీమ, మార్కాపురం, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో అక్కడక్కడ ఉరుములతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడొచ్చని తెలిపారు. మిగిలిన ప్రాంతాల్లో తేలికపాటి జల్లులు కురిసే అవకాశం ఉందన్నారు. భారత వాతావరణ శాఖ (ఐఎండీ) కూడా రానున్న కొద్దిరోజుల పాటు ఏపీలో పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు, గంటకు 40-50 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీస్తాయని తన నివేదికలో పేర్కొంది. ఆదివారం (జూన్ 28) కాకినాడ, కోనసీమ, ఉభయ గోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో పిడుగులతో కూడిన వర్షాలకు ఆస్కారం ఉందని అధికారులు వివరించారు. వర్షాలు, ఈదురు గాలుల సమయంలో ప్రజలు చెట్లు, హోర్డింగ్‌ల కింద ఆశ్రయం పొందవద్దని సూచించారు. విద్యుత్ తీగలకు దూరంగా ఉండాలని, రైతులు, పశువుల కాపరులు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని విజ్ఞప్తి చేశారు.

# దివీస్ ల్యాబ్స్‌లో విద్యుత్ భద్రతా వారోత్సవాలు ప్రారంభం

**- పని ప్రదేశాలలో ప్రమాదాల నివారణకు ప్రాధాన్యత**

**- ఉద్యోగులు, కార్మికులతో భద్రతా ప్రతిజ్ఞ**

**తొలివెలుగు, చౌటుప్పల్:** చౌటుప్పల్ మండలం అంకిరెడ్డి గూడెం గ్రామ పరిధిలో గల ప్రముఖ ఔషధ తయారీ పరిశ్రమ దివీస్ లేబొరేటరీస్'లో జాతీయ విద్యుత్ భద్రతా వారోత్సవాలు (జూన్ 26 నుండి జూలై 02 వరకు) శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. వారోత్సవాల తొలిరోజు సందర్భంగా సంస్థలోని ఉద్యోగులకు, సాంకేతిక కార్మికులకు విద్యుత్ భద్రత మరియు ప్రమాదాల నివారణపై ప్రత్యేక అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా కంపెనీ ఉన్నతాధికారులు మరియు రక్షణ విభాగపు నిపుణులు మాట్లాడుతూ.. పరిశ్రమల్లో ఉత్పత్తి ఎంత ముఖ్యమో, పనిచేసే సిబ్బంది రక్షణ అంతకంటే ముఖ్యమని పేర్కొన్నారు. పని ప్రదేశాలలో విద్యుత్ పరికరాలను సురక్షితంగా ఎలా వినియోగించాలి, అత్యవసర సమయాల్లో అగ్నిమాపక పనిముట్లను (ఫైర్ ఫైటింగ్ ఎక్విప్మెంట్) ఏ విధంగా హ్యాండిల్ చేయాలనే అంశాలపై క్షేత్రస్థాయి అవగాహన కల్పించారు. ముఖ్యంగా భారీ పరిశ్రమలలో విద్యుత్ మరమ్మతులు చేపట్టే సమయంలో ప్రమాద రహిత వాతావరణం కోసం పాటించాల్సిన 'లోటో' (లోటో - లాక్ ఔట్ అండ్ ట్యాగ్) పద్ధతి యొక్క ప్రాధాన్యతను సిబ్బందికి వివరించారు.

**వ్యక్తిగత భద్రత ముఖ్యం:**

ప్రతి ఒక్క ఉద్యోగి విధి నిర్వహణలో ఉన్నప్పుడు తప్పనిసరిగా వ్యక్తిగత భద్రతా జాగ్రత్తలు (పీ పీ ఈ) పాటించాలని, ఏమరపాటుగా వ్యవహరిస్తే ప్రాణాలకే ప్రమాదం వాటిల్లే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరించారు. అనంతరం విద్యుత్ భద్రతా నిబంధనలను నిరంతరం తూచా తప్పకుండా పాటిస్తామని కంపెనీ ఉద్యోగులు, కార్మికులందరితో కలిసి ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో దివీస్ లేబొరేటరీస్ వైస్ ప్రెసిడెంట్ ఎస్. రామకృష్ణ, సేఫ్టీ జనరల్ మేనేజర్ బి. బాలకిషోర్, జనరల్ మేనేజర్ పెండ్యాల సుధాకర్, డిప్యూటీ జనరల్ మేనేజర్ రావి సురేష్, అసిస్టెంట్ జనరల్ మేనేజర్ బొప్పన శ్రీనివాసరావు, ఇతర కంపెనీ ఉన్నతాధికారులు, రక్షణ విభాగపు సిబ్బంది పాల్గొన్నారు.



# రాజగోపాల్ రెడ్డిపై చౌకబారు విమర్శలా?.. సర్పంచ్ ప్రదీప్ జీ ఫైర్!

- పార్టీలు, జెండాలు చూడకుండా మునుగోడులో అభివృద్ధి
- మన పన్నుల సొమ్ము తిని కేంద్రం మనకే మొండిచేయి చూపుతోంది: ప్రదీప్ జీ



**తొలివెలుగు, చౌటుప్పల్:** మునుగోడు నియోజకవర్గ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిపై ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలపై ఎస్. లింగోటం సర్పంచ్ భీమిడి ప్రదీప్ జీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ప్రజలను తప్పుదోవ పట్టించే తప్పుడు ఆరోపణలను వెంటనే ఆపాలని హెచ్చరించారు. ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి ఏనాడూ పార్టీలు చూసి నిధులు కేటాయించలేదని, నియోజకవర్గంలోని అన్ని గ్రామాలు ఆయనకు సమానమేనని స్పష్టం చేశారు. ఎక్కడ సమస్య ఉంటే అక్కడ నిధులు ఇచ్చి పరిష్కరించే మనస్తత్వం ఆయనదన్నారు. ఎమ్మెల్యే గనుక పక్షపాత రాజకీయాలు చేసి ఉంటే.. నేడు బీఆర్ఎస్, బీజేపీ లీడర్లు తమ గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను చూసి మాట్లాడే ధైర్యం కూడా చేసేవారు కాదన్నారు.

**తెలంగాణపై కేంద్రం పక్షపాతం:**

కేంద్రం ఇస్తున్న నిధులపై ప్రతిపక్షాలు గొప్పలు చెప్పుకోవడం హాస్యాస్పదమని ప్రదీప్ జీ మండిపడ్డారు. "కేంద్ర ప్రభుత్వం ఏమైనా వాళ్ల సొమ్ము ఇస్తోందా?.. తెలంగాణ రాష్ట్ర ప్రజలు కట్టిన పన్నుల సొమ్ములో సగం వాళ్లు తిని, మిగిలిన సగం మాత్రమే మనకు ఇస్తున్నారు" అని ఘాటుగా విమర్శించారు. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణకు రావాల్సిన నిధుల విషయంలో కేంద్రం తీవ్ర పక్షపాతం చూపిస్తోందని, బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాలకే నిధుల మూటలు ముట్టజెబుతోందని ధ్వజమెత్తారు. గత మూడేళ్లుగా కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు మొండిచేయి చూపిన విషయం ప్రతిపక్షాలకు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. విమర్శలు చేయడం సులువు కానీ, ప్రజల కోసం నిరంతరం శ్రమించడం రాజగోపాల్ రెడ్డికే సాధ్యమైందన్నారు. తప్పుడు ప్రచారాలు ఆపకపోతే ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

# లబ్ధిదారులకు నూతన వస్త్రాలిచ్చి అభినందించిన బీర్ల ఐలయ్య




**తొలివెలుగు, రాజాపేట:** రాజాపేట మండల కేంద్రంలో నిర్వహించిన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల నూతన గృహప్రవేశ మహోత్సవంలో ఆలేరు శాసనసభ్యుడు, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య పాల్గొన్నారు. శుక్రవారం మండల కేంద్రానికి చెందిన లబ్ధిదారురాలు నీలం స్వరూప, ఆమె కుమారుడు క్రాంతి నూతన గృహంలోకి ప్రవేశించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రభుత్వ విప్.. లబ్ధిదారుల కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా స్వరూప, క్రాంతిలకు ఆయన నూతన వస్త్రాలను అందజేసి అభినందించారు. పేద ప్రజల సొంతింటి కల సాకారం చేయడమే ప్రభుత్వ ధ్యేయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మహేందర్ గౌడ్, నాయకుడు మెడిశెట్టి సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబానికి నడిమింటి బ్రదర్స్, బీర్ల ఫౌండేషన్ ఆసరా

- రూ.5 వేల ఆర్థిక సహాయం, 50 కిలోల బియ్యం అందజేత

**తొలివెలుగు, రాజాపేట:** మండలం దూది వెంకటాపురం గ్రామానికి చెందిన జలకొండ పోచమ్మ (పెద్దమ్మ) ఇటీవల అనారోగ్యంతో అకాల మరణం చెందారు. శుక్రవారం ఆమె కుటుంబ సభ్యులను గ్రామ సర్పంచ్ నడిమింటి నరేష్ పరామర్శించి ధైర్యం చెప్పారు. అనంతరం బాధిత కుటుంబానికి నడిమింటి బ్రదర్స్ తరపున రూ.5,000 ల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. అదేవిధంగా, బీర్ల ఫౌండేషన్ ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి ఆసరాగా నిలిచేందుకు 50 కిలోల బియ్యాన్ని సర్పంచ్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఆపదలో ఉన్న పేద కుటుంబాలను ఆదుకోవడానికి సేవా సంస్థలు ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు మంగ కృష్ణ, యూత్ ప్రెసిడెంట్ కోరుకొప్పుల శ్రీధర్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు, యువజన విభాగం ప్రతినిధులు పాల్గొన్నారు.



# మతసామరస్య వేడుక.. పోచంపల్లిలో పీర్ల పండుగ కోలాహలం!

- మతసామరస్యానికి ప్రతీకగా పీర్ల పండుగ
- ఆషుర్‌ఖానాల వద్ద పోటెత్తిన భక్తులు.. మొక్కుల చెల్లింపు
- డప్పు చప్పుళ్లు, నృత్యాలతో పీర్ల ఊరేగింపు

**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి:** హిందూ, ముస్లింల మతసామరస్యానికి ప్రతీకగా నిలిచే మొహర్రం పండుగ వేడుకలను శుక్రవారం పట్టణ, మండల వ్యాప్తంగా భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఆషుర్‌ఖానాలలో ప్రతిష్టించిన పీర్లను దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. పీర్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి, మత సంప్రదాయాల ప్రకారం చెద్దర్లను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం సాయంత్రం వేళల్లో పీర్ల ఊరేగింపును వైభవంగా నిర్వహించారు. డప్పు వాయిద్యాల చప్పుళ్లు, యువకుల నృత్యాల నడుమ పురవీధుల్లో సాగిన ఊరేగింపు భక్తులను ఆకట్టుకుంది.



# సిరిపురంలో కూనూరు గోపాల్ గౌడ్ మృతి.. అంజలి ఘటించిన చిరుమర్తి



- బాధిత కుటుంబానికి బీఆర్ఎస్ శ్రేణుల భరోసా

**తొలివెలుగు, రామన్నపేట:** మండలం సిరిపురం గ్రామానికి చెందిన కూనూరు గోపాల్ గౌడ్ (58) అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య శుక్రవారం సిరిపురం గ్రామానికి చేరుకుని, గోపాల్ గౌడ్ భౌతికకాయానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం మృతుని కుటుంబ సభ్యులను కలిసి వారిని ఓదార్చారు. కుటుంబానికి మనోధైర్యం కల్పించి, అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు పోషబోయిన మల్లేశం, గ్రామ సర్పంచ్ అంబటి ఉపేంద్రమ్మ రవీందర్ రెడ్డి, గర్దాస్ విక్రమ్, పులిపలుపుల సునీత, మాజీ ఎంపీటీసీ పున్న వెంకటేశం, జిల్లా నాయకులు బద్దుల రమేష్, అంతటి రమేష్, ఎస్.కె చాంద్, గ్రామ శాఖ అధ్యక్షుడు బండ శ్రీనివాస్ రెడ్డి, నాయకులు కాటేపల్లి యాదయ్య, కూనూరు ముత్తయ్య, నల్ల స్వామి, చొప్పరి నరసింహ, నల్ల సైదులు, గాదె శంక,ర్ కూనూరు రమేష్, కదారి మల్లేశం, మేడి కృష్ణ, అప్పం శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

# ఐక్యతతోనే బీసీల రాజ్యాధికారం సాధ్యం




- రాజ్యాధికార సమరభేరి' సభ వాల్ పోస్టర్ల ఆవిష్కరణ
- హాజరైన పార్టీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు పటేల్ వనజక్క

**తొలివెలుగు, ఆత్మకూర్(ఎం) :** బీసీ సంఘాలు, సామాజిక సంస్థలు, మేధావులు ఐక్యంగా ముందుకు సాగినప్పుడే బీసీల రాజ్యాధికార సాధన సాధ్యమవుతుందని తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు పటేల్ వనజక్క పేర్కొన్నారు. జులై 05వ తేదీన భువనగిరిలో నిర్వహించనున్న 'రాజ్యాధికార సమరభేరి' బహిరంగ సభకు సంబంధించిన వాల్ పోస్టర్లను శుక్రవారం ఆత్మకూర్(ఎం)లో ఆవిష్కరించారు. పార్టీ మండల అధ్యక్షుడు ఎలిమినేటి బుచ్చయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ?ఈ సందర్భంగా పటేల్ వనజక్క మాట్లాడుతూ.. బహుజన వర్గాల రాజకీయ హక్కుల కోసం తెలంగాణ రాజ్యాధికార పార్టీ నిరంతరం పోరాడుతోందన్నారు. భువనగిరిలో జరగబోయే బహిరంగ సభ బహుజనుల రాజకీయ చైతన్యానికి చారిత్రాత్మక వేదికగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సభకు బీసీ సంఘాల నాయకులు, మహిళలు, యువత, మేధావులు భారీ సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఇ. ఓదేలు యాదవ్, క్రమశిక్షణ కమిటీ చైర్మన్ బి. నర్సయ్య గౌడ్, రాష్ట్ర కమిటీ సభ్యుడు పిట్టల శంకర్, జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు పిట్టల సుశీల, నాగరాజు, బాబు తదితరులు పాల్గొన్నారు.



# పారదర్శక ఓటర్ల జాబితా రూపకల్పనకు సహకరించాలి

- నమిల గ్రామంలో ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ
- సర్పంచ్ పులి రాజు యాదవ్

**తొలివెలుగు, రాజాపేట:** మండలం నమిల గ్రామంలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్) కార్యక్రమం శుక్రవారం ఉత్సాహంగా సాగింది. గ్రామంలో బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓ) చేపట్టిన ఇంటింటి సర్వేలో గ్రామ సర్పంచ్ పులి రాజు యాదవ్ పాల్గొని, ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారాలను అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకునేలా ఈ ప్రత్యేక సవరణ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కోరారు. ఎలాంటి తప్పులు లేని పారదర్శకమైన ఓటర్ల జాబితా రూపకల్పనకు గ్రామీణులు సహకరించాలన్నారు. నేరుగా ఫారాలు సమర్పించడంతో పాటు ఆన్‌లైన్ ద్వారా కూడా తమ వివరాలను సులభంగా నమోదు చేసుకునే అవకాశం ఉందని ఓటర్లకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్థానిక బీఎల్‌ఓలు, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# రాజాపేట మండలంలో ఘనంగా మొహర్రం వేడుకలు

- మతసామరస్యానికి ప్రతీకగా పీర్ల పండుగ
- ?ఆషుర్‌ఖానాల వద్ద హిందూ, ముస్లింల ప్రత్యేక పూజలు

**తొలివెలుగు, రాజాపేట:** మండల వ్యాప్తంగా శుక్రవారం మొహర్రం పండుగ వేడుకలను ప్రజలు ఘనంగా నిర్వహించుకున్నారు. మండలంలోని పలు గ్రామాలలో పీర్ల ఊరేగింపులు, ప్రత్యేక పూజలు వైభవంగా జరిగాయి. ఆషుర్‌ఖానాల వద్ద హిందూ, ముస్లింలు కలిసికట్టుగా వేడుకల్లో పాల్గొని మతసామరస్యాన్ని చాటారు. ?మండల పరిధిలోని చల్లూరు గ్రామంలో మొహర్రం ఉత్సవాలను మహమ్మద్ ఇస్మాయిల్ నేతృత్వంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కులమతాలకు అతీతంగా, గ్రామ ప్రజలందరి సహకారంతో ప్రతి ఏటా ఈ పండుగను ఐక్యతతో జరుపుకుంటామని తెలిపారు. వేడుకల్లో మహమ్మద్ షరీఫ్, బాబా, గౌస్, రాములు, మల్లయ్య, మాటూరి వెంకటేశం, పదీరు పాండు, లాలు, కృష్ణ, సాయి తదితరులు పాల్గొన్నారు. చల్లూరు గ్రామ సర్పంచ్ భీమగాని రూప బాలనర్సయ్య, ఉపసర్పంచ్ బొంత సుధాకర్, వివిధ పార్టీల నాయకులు ఆషుర్‌ఖానాను సందర్శించి, ప్రజలకు మొహర్రం పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.





## కాంగ్రెస్ నాయకుడి జన్మదిన వేడుకల్లో పాల్గొన్న ప్రభుత్వ విప్ వేముల వీరేశం

**కేక్ కట్ చేసి అభినందనలు తెలిపిన నకిరేకల్ ఎమ్మెల్యే**

**తొలివెలుగు, రామన్నపేట:** మండలం కొత్తగూడెం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు శంబాల వెంకటేశం జన్మదిన వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు నకిరేకల్ శాసనసభ్యుడు, ప్రభుత్వ విప్ వేముల వీరేశం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా శంబాల వెంకటేశంతో ఎమ్మెల్యే కేక్ కట్ చేయించి, ఆయనకు శాలువా కప్పి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. పార్టీ బలోపేతానికి కార్యకర్తలు, నాయకులు సమన్వయంతో కృషి చేయాలని ఈ సందర్భంగా ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ స్థానిక నాయకులు, వివిధ అనుబంధ సంఘాల ప్రతినిధులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## 28న కొడంగల్‌లో 'కృతజ్ఞత ర్యాలీ'.. జయప్రదం చేయాలి

**- తెలంగాణ ఉద్యమకారుల ఫోరం నాయకుల పిలుపు**

**తొలివెలుగు, వలిగొండ:** తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కొరకు కేశవరావు కమిటీని ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలుపుతూ ఈ నెల 28న కొడంగల్‌లో నిర్వహించే కృతజ్ఞత ర్యాలీని విజయవంతం చేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం నాయకులు పిలుపునిచ్చారు. వలిగొండ మండల కేంద్రంలో శుక్రవారం ఫోరం మండల అధ్యక్షుడు మారగోని శ్రీనివాస్ గౌడ్ అధ్యక్షతన సన్నాహక సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జోగు అంజన్న, ఉమ్మడి నల్గొండ జిల్లా అధ్యక్షుడు శీలం స్వామి మాట్లాడుతూ.. రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చీమ శ్రీనివాస్ పిలుపుమేరకు ఈ భారీ ర్యాలీని తలపెట్టినట్లు వివరించారు. ఆదివారం ఉదయం 11 గంటలకు చేవెళ్ల శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం నుండి 100 కార్లతో కొడంగల్ వరకు ఈ ప్రదర్శన సాగుతుందన్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా ఉన్న ఉద్యమకారులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ర్యాలీని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఉద్యమకారులు బత్తిని రవి, బత్తిని సహదేవ్ గౌడ్, కొండూరు సత్తయ్య గౌడ్, మల్లం వెంకటేశం, బొడిగే సుదర్శన్ గౌడ్, ఫోరం మహిళా అధ్యక్షురాలు ఐటిపాముల పుష్ప తదితరులు పాల్గొన్నారు.







## వివాహేతర సంబంధం విషాదం.. వివాహిత ఆత్మహత్య

**- ప్రియుడే కారణమంటూ మృతదేహంతో కుటుంబ సభ్యుల ఆందోళన**

**- ఆత్మకూరు(ఎం)లో ఉద్రిక్త పరిస్థితులు.. భారీ పోలీసు బందోబస్తు**

**తొలివెలుగు, ఆత్మకూరు(ఎం):** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండల కేంద్రంలో వివాహేతర సంబంధం విషాదాంతానికి దారితీసింది. వివాహిత ఆత్మహత్యకు పాల్పడగా, ఆమె మృతికి ప్రియుడే కారణమంటూ కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు మృతదేహంతో ఆందోళనకు దిగారు. ఈ ఘటనతో మండల కేంద్రంలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆత్మకూరు(ఎం) మండల కేంద్రానికి చెందిన శిగ లక్ష్మణ్‌కు సుమారు 20 ఏళ్ల క్రితం నల్లగొండ జిల్లా కట్టంగూరు మండలం ఈదులూరు గ్రామానికి చెందిన స్వరూపతో వివాహమైంది. వీరికి ఒక కుమార్తె, ఒక కుమారుడు ఉన్నారు. లక్ష్మణ్ స్థానికంగా జనరల్ స్టోర్ నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఇదిలా ఉండగా, స్వరూప అదే గ్రామానికి చెందిన నాగం మల్లారెడ్డితో గత మూడేళ్లుగా వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నట్లు సమాచారం. కొంతకాలం క్రితం ఆమె భర్త, పిల్లలను వదిలి మల్లారెడ్డితో వెళ్లిపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనంతరం మల్లారెడ్డి ఆమెను తిరిగి కుటుంబ సభ్యులకు అప్పగించాడు. అయితే 15 రోజుల క్రితం మరోసారి స్వరూప ఇంటి నుంచి వెళ్లి మల్లారెడ్డితో కలిసి హైదరాబాద్‌లో నివసిస్తున్నట్లు తెలిసింది. ఈ నెల 18న కుటుంబ సభ్యులు హైదరాబాద్‌కు వెళ్లి ఆమెకు నచ్చజెప్పి తిరిగి తీసుకొచ్చి గుండాల మండలం అంబాల గ్రామంలోని బంధువుల ఇంట్లో ఉంచారు. మరుసటి రోజు భర్త లక్ష్మణ్ ఆమెను ఇంటికి తీసుకువచ్చేందుకు వెళ్లగా, అప్పటికే స్వరూప ఉరేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు గుర్తించారు. వెంటనే ఆమెను హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ ఈ నెల 23న మృతి చెందింది.

**మృతదేహంతో ప్రియుడు ఇంటి ముందు ఆందోళన:**

పోస్టుమార్టం అనంతరం శుక్రవారం మృతదేహాన్ని ఆత్మకూరుకు తీసుకురాగానే ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. స్వరూప ఆత్మహత్యకు మల్లారెడ్డే కారణమని ఆరోపిస్తూ, ఆమె పిల్లలకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. మొదట ఆత్మకూరు చౌరస్తాలో మృతదేహంతో ధర్నాకు దిగిన ఆందోళనకారులు, అనంతరం మృతదేహాన్ని మల్లారెడ్డి ఇంటి ముందు ఉంచి నిరసన వ్యక్తం చేశారు. ఈ విషయం తెలుసుకున్న మల్లారెడ్డి తన కుటుంబ సభ్యులతో కలిసి పరారైనట్లు సమాచారం. పరిస్థితిని అదుపులోకి తీసుకురావడానికి పోలీసులు పలుమార్లు ఆందోళనకారులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. అయితే వారు వినకపోవడంతో ఉద్రిక్తత మరింత పెరిగింది. కొందరు పెద్దలు మల్లారెడ్డితో మాట్లాడేందుకు ప్రయత్నించినప్పటికీ, అతని ఫోన్ స్విచ్ ఆఫ్‌లో ఉన్నట్లు తెలిసింది. న్యాయం జరిగే వరకు ఆందోళన విరమించబోమని, స్పందించకపోతే మృతదేహాన్ని అతని ఇంటి ఎదుటే దహనం చేస్తామని బంధువులు హెచ్చరించారు. అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా చౌటుప్పల్ డీసీపీ మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.





## సీపీఎం 'రాజకీయ తరగతులు' జయప్రదం చేయండి!

**- సుంకిశాలలో బహిరంగ సభ కరపత్రాల ఆవిష్కరణ**

**- హాజరుకానున్న పార్టీ రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ**

**తొలివెలుగు, వలిగొండ:** మండల పరిధిలోని సుంకిశాల గ్రామంలో ఈ నెల 29, 30 తేదీల్లో నిర్వహించనున్న సీపీఎం మండల స్థాయి రాజకీయ శిక్షణ తరగతులు, బహిరంగ సభను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు మద్దెల రాజయ్య కోరారు. శుక్రవారం వలిగొండలో ఇందుకు సంబంధించిన కరపత్రాలను పార్టీ నాయకులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మద్దెల రాజయ్య, సీపీఎం మండల కార్యదర్శి సిర్పంగి స్వామి మాట్లాడుతూ.. జూన్ 29న సుంకిశాలలో జరిగే బహిరంగ సభకు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎండీ జహంగీర్ ముఖ్య అతిథులుగా హాజరవుతారని తెలిపారు. రెండు రోజుల పాటు జరిగే ఈ శిక్షణ తరగతులకు మండల వ్యాప్తంగా సుమారు 400 మంది ప్రతినిధులు హాజరుకానున్నట్లు వివరించారు.



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలు, స్థానిక సమస్యలపై ఈ తరగతుల్లో విస్తృతంగా చర్చించి, భవిష్యత్తు పోరాట కర్తవ్యాలను ఖరారు చేస్తామన్నారు. ఈ కార్యక్రమాల విజయవంతానికి ప్రజలు, కార్మికులు ఆర్థిక, హార్దిక సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పీఎన్ఎం జిల్లా కార్యదర్శి పీర్లపల్లి ముత్యాలు, పార్టీ నేతలు మెరుగు వెంకటేశం, కవిడే సురేష్, బూడిద మనమ్మ, గర్దాసు నరసింహ, కొండూరు సత్తయ్య పాల్గొన్నారు.

## వంకమామిడిలో సామూహిక ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశాలు

**- పేదలకు సొంతింటి కల సాకారం: సర్పంచ్ మచ్చ శ్రీనివాస్**

**- గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతామన్న నాయకులు**

**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి:** మండల పరిధిలోని వంకమామిడి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల సామూహిక గృహప్రవేశాలు శుక్రవారం వైభవంగా జరిగాయి. గ్రామానికి చెందిన లబ్ధిదారులు కుంభం భార్గవి-లింగస్వామి, ఉడతల భాగ్యలక్ష్మి-భాస్కర్, కాసుల అనిత-చందు, బొడిగ మానస-నరసింహగౌడ్, బొంగు బాలమణి నూతనంగా నిర్మించుకున్న గృహాల ప్రారంభోత్సవంలో సర్పంచ్ మచ్చ శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఉప్పునూతల వెంకటేష్ యాదవ్ ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సామాన్యుల సొంతింటి కలను నిజం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన ధ్యేయమన్నారు. స్థానిక ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి ప్రత్యేక చొరవతో నియోజకవర్గంలోనే మొదటిసారిగా వంకమామిడి గ్రామానికి 100 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయించారని తెలిపారు. ఎమ్మెల్యే కృషితోనే ఈరోజు వంకమామిడి గ్రామం నియోజకవర్గంలో ఒక మోడల్ విలేజ్ (ఆదర్శ గ్రామం)గా నిలుస్తోందని స్పష్టం చేశారు. ప్రజా సంక్షేమమే పరమావధిగా ప్రభుత్వం పనిచేస్తోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ వైస్ చైర్మన్ సామ మోహన్ రెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షుడు జింక జంగయ్య, మార్కెట్ కమిటీ డైరెక్టర్ సురవి వెంకటేష్ గౌడ్, మాజీ సర్పంచ్ బొడిగ శంకరయ్య, నాయకులు కాసుల బాలకృష్ణ, చెక్క లింగయ్య పాల్గొన్నారు.



## గడువులోగా డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పనులు పూర్తి చేయాలి

**- సింగన్నగూడెం కాలనీలో అదనపు కలెక్టర్ భాస్కరరావు తనిఖీ**

**- నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవు: అధికారులు నిరంతరం పర్యవేక్షించాలి**

**తొలివెలుగు, భువనగిరి:** భువనగిరి మున్సిపాలిటీ పరిధిలోని సింగన్నగూడెం డబుల్ బెడ్‌రూమ్ (2 బీ ఎచ్ కే) కాలనీలో పెండింగ్ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కరరావు సంబంధిత అధికారులను ఆదేశించారు. కాలనీలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను శుక్రవారం ఆయన క్షేత్రస్థాయిలో సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. కాలనీలో నిర్మాణ పనుల పురోగతితో పాటు తాగునీరు, విద్యుత్, అంతర్గత రహదారులు, డ్రైనేజీ తదితర మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. మిగిలిపోయిన పనులను త్వరితగతిన పూర్తి చేసి, లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ముఖ్యంగా పనుల్లో నాణ్యతా ప్రమాణాలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, నిర్దేశిత గడువులోగా పనులు పూర్తయ్యేలా ఇంజినీరింగ్ అధికారులు నిరంతరం క్షేత్రస్థాయి పర్యవేక్షణ చేయాలని సూచించారు. కాలనీలో ప్రస్తుతమున్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ పీడీ అలివేలు, ఇంజినీరింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.





## కేజీబీవీని సందర్శించిన అదనపు కలెక్టర్ భాస్కర్ రావు





**- విద్యార్థినులతో మాట్లాడి వసతులపై ఆరా**


**- పరిశుభ్రత లోపించకుండా చూడాలని అధికారులకు ఆదేశం**

**తొలివెలుగు, భువనగిరి:** భువనగిరి పట్టణంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని (కేజీబీవీ) స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాల తరగతి గదులతో పాటు మౌలిక వసతులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. విద్యార్థినులకు అందుతున్న విద్యాబోధన, వసతి, తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్ల నిర్వహణ, పారిశుద్ధ్యం తదితర అంశాలను ఆయన నిశితంగా తనిఖీ చేశారు. భోజన నాణ్యత ప్రమాణాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అదనపు కలెక్టర్ విద్యార్థినులతో ముఖాముఖి మాట్లాడారు. వారి విద్యాభ్యాసం, ఆరోగ్య పరిస్థితి, పాఠశాలలో ఎదుర్కొంటున్న ఇబ్బందుల గురించి ఆరా తీశారు. పాఠశాల ఆవరణను నిరంతరం పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలని, బాలికలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉంచాలని సంబంధిత అధికారులను, పాఠశాల సిబ్బందిని ఆదేశించారు. ప్రభుత్వం అందిస్తున్న నాణ్యమైన సౌకర్యాలను విద్యార్థినులు సద్వినియోగం చేసుకుని విద్యలో అత్యుత్తమ రాణించాలని ఆకాంక్షించారు. ఈ తనిఖీ కార్యక్రమంలో పలువురు జిల్లా అధికారులు, విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# బాబోయ్ శునకాలు...

## జన్నారం మండలంలో వీధి కుక్కల స్వైర విహారం!

- పాదచారులు, వాహనదారులపై విరుచుకుపడుతున్న వైనం
- చిన్నారులు, వృద్ధులపై దాడులు.. పశువులు, జీవాలు మృత్యువాత
- రాత్రివేళల్లో నిద్రపట్టనివ్వని గ్రామ సింహాల అరుపులు
- పట్టించుకోని అధికార యంత్రాంగం.. భయాందోళనలో ప్రజలు




**తొలివెలుగు, జన్నారం:** పల్లె, పట్నం అనే తేడా లేకుండా గ్రామ సింహాలు రెచ్చిపోతున్నాయి. మండల వ్యాప్తంగా వీధుల్లో గుంపులు గుంపులుగా స్వైర విహారం చేస్తూ పాదచారులు, వాహనదారులపై విరుచుకుపడుతున్నాయి. చిన్నారులు, వృద్ధులతో పాటు పశువులు, జీవాలపై దాడులకు పాల్పడుతున్నాయి. రోజూ ఎక్కడో ఒకచోట ఎవరో ఒకరు కుక్క కాటుకు గురవుతూ బాధితులు ఆసుపత్రుల పాలవుతున్న సంఘటనలు నిత్యకృత్యంగా మారాయి. దీంతో జనాలు ఇళ్ల నుంచి బయటకు రావాలంటేనే వణికిపోవాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయి. శునకాల బెడద నివారణకు అధికార యంత్రాంగం ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం ప్రజలకు ప్రాణ సంకటంగా మారిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**నిద్రలేని రాత్రులు.. జంకుతున్న వాహనదారులు:**

జన్నారం మండల కేంద్రంతో పాటు చుట్టుపక్కల గ్రామాల్లో కుక్కలు గుంపులుగా సంచరిస్తూ ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నాయి. ఇంటి బయట ఆడుకునే చిన్నారులు, వృద్ధులను లక్ష్యంగా చేసుకుని దాడులకు దిగుతున్నాయి. ఇక ద్విచక్ర వాహనదారుల పరిస్థితి వర్ణనాతీతంగా మారింది. బైక్‌లు కనిపిస్తే చాలు కిలోమీటర్ల మేర వెంటాడుతుండటంతో ప్రమాదాల బారిన పడుతున్నారు. పగలు ఈ రకమైన ఇబ్బందులు ఉంటే, రాత్రి వేళల్లో శునకాల అరుపుల ప్రహసనంతో ప్రజలు ప్రశాంతంగా నిద్రపోలేని పరిస్థితులు నెలకొంటున్నాయి.

**జీవాలు మృత్యువాత..**

కేవలం మనుషులపైనే కాకుండా, మూగజీవాలపై కూడా ఈ వీధి కుక్కలు ప్రతాపం చూపిస్తున్నాయి. పశువులు, మేకలు, గొర్రెలపై దాడులు చేస్తూ రైతాంగానికి తీవ్ర నష్టం కలిగిస్తున్నాయి. ఇప్పటికే మండలంలోని పలు గ్రామాల్లో కుక్కల దాడిలో పలువురి ఆవులు, గేదెలు, మేకలు, గొర్రెలు, కోళ్లు మృత్యువాత పడ్డ సంఘటనలు ఉన్నాయి. అయినా స్థానిక పంచాయతీ అధికారులు కానీ, ఉన్నతాధికారులు కానీ ఇప్పటివరకు ఎలాంటి నివారణ చర్యలు (సంతాన నిరోధక శస్త్రచికిత్సలు/కుక్కల నియంత్రణ) చేపట్టకపోవడంపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వీధి కుక్కల బెడద నుండి రక్షించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

### కుక్కల బెడదతో చాలా ఇబ్బందులకు గురవుతున్నాము:



వీధి కుక్కల సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతోంది. రోడ్డుపై నడవాలంటేనే భయం వేస్తోంది. పిల్లలను ఒంటరిగా బయటకు పంపించలేకపోతున్నాము. రాత్రి వేళల్లో వాటి అరుపుల వల్ల కంటిమీద కునుకు ఉండటం లేదు. అధికారులు స్పందించి ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి.

**- చిలివేరి సత్యనారాయణ, స్థానికుడు**

### అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలి



మా మండలంలో కుక్కల దాడులు విపరీతంగా పెరిగాయి. వాహనాలపై వెళ్లేటప్పుడు వెంటపడి కరుస్తున్నాయి. దీనివల్ల ఎంతోమంది బైక్‌ల పైనుంచి కిందపడి గాయాలపాలయ్యారు. పశువులను కూడా వదలడం లేదు. అధికారులు వెంటనే స్పందించి కుక్కల బెడదను అరికట్టాలని కోరుతున్నాము.

**-చింతల సతీష్, స్థానికుడు**



## అక్రమంగా పశువుల తరలింపు.. వాహనం స్వాధీనం

- 11 పశువుల రక్షణ.. ఒకరి అరెస్టు
- తంగడపల్లి క్రాస్ రోడ్డు వద్ద పోలీసుల తనిఖీలు

**తొలివెలుగు, చౌటుప్పల్:** చౌటుప్పల్ పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమంగా పశువులను రవాణా చేస్తున్న ఒక వాహనాన్ని పోలీసులు శుక్రవారం స్వాధీనం చేసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ జి.మన్మథ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. చౌటుప్పల్ హెడ్ కానిస్టేబుల్ కె.రాంబాబు, ఏఆర్‌పీసీ-7967 సిబ్బంది పీఎం-1 విధుల్లో ఉండగా అక్రమంగా పశువుల రవాణా జరుగుతున్నట్లు నమ్మదగిన సమాచారం అందింది. దీంతో అప్రమత్తమైన పోలీసులు చౌటుప్పల్ పట్టణంలోని తంగడపల్లి క్రాస్ రోడ్ వద్ద వాహన తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో అనుమానాస్పదంగా వచ్చిన మహీంద్రా బొలెరో వాహనాన్ని (టీఎస్ 29టీ 0342) ఆపి తనిఖీ చేయగా, అందులో ఎలాంటి అనుమతులు లేకుండా క్రూరంగా తరలిస్తున్న 11 పశువులను (4 ఆవులు, 7 ఎద్దులు) గుర్తించారు. వాహనాన్ని నడుపుతున్న కోదాడ మతానగర్‌కు చెందిన ఎస్‌కే అమీర్ (24)ను అదుపులోకి తీసుకుని విచారించగా.. వాహన యజమాని ఎస్‌కే అక్రం సూచనల మేరకు కోదాడ సంతలో వీటిని కొనుగోలు చేసి హైదరాబాద్‌లోని బహదూర్‌పురకు తరలిస్తున్నట్లు అంగీకరించాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ మన్మథ కుమార్ తెలిపారు.

## తాళ్లసింగారం, ధర్మాజీగూడెంలో వృద్ధులకు ఉచిత వైద్య శిబిరాలు

- ఆరోగ్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి: తురక షడ్రక్
- పాల్గొన్న 'హెల్పేజ్ ఇండియా', 'హెచ్ఎస్‌బీసీ' ప్రతినిధులు

**తొలివెలుగు, చౌటుప్పల్:** చౌటుప్పల్ మండల పరిధిలోని తాళ్లసింగారం, ధర్మాజీగూడెం గ్రామాలలో శుక్రవారం ప్రముఖ స్వచ్ఛంద సేవా సంస్థ 'హెల్పేజ్ ఇండియా', 'హెచ్ఎస్‌బీసీ' ప్రాజెక్ట్ సంయుక్త ఆధ్వర్యంలో వృద్ధులకు ఉచిత వైద్య శిబిరాలు, మందుల పంపిణీ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ శిబిరాల్లో గ్రామ సమాఖ్య లీడర్స్, వృద్ధుల సంఘాల సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆరోగ్య సేవలను వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా హెల్పేజ్ ఇండియా ప్రాజెక్టు ఆఫీసర్ తురక షడ్రక్ మాట్లాడుతూ.. తమ సంస్థ ద్వారా వృద్ధుల జీవనోపాధి, ఆరోగ్యం కోసం నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. వృద్ధులు వయోభారంతో వచ్చే మోకాళ్ల నొప్పులు, రక్తపోటు (బీపీ) వంటి ఆరోగ్య సమస్యల పట్ల అప్రమత్తంగా ఉంటూ తగిన జాగ్రత్తలు వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ ఇన్‌చార్జ్ పోచంపల్లి వి.వేణు, హెల్పేజ్ ఇండియా స్టేట్ హెడ్ యేతేంద్ర యాదవ్, మేనేజర్ మృణాల్ శ్రీకాంత్, గ్రామ వాలంటీర్లు దొనకొండ అనూష, బోయ సుజాత, లక్ష్మీ ప్రసన్నతో పాటు వైద్యులు, నర్సులు, ఫార్మసిస్టు పాల్గొన్నారు. వృద్ధులకు ఉచితంగా వైద్య సేవలు, మందులు అందించినందుకు గ్రామ లీడర్స్, వృద్ధులు సంస్థ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు.



## మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

- తంగడపల్లి బీపీఈడీ కళాశాలలో యాంటీ డ్రగ్స్ అవగాహన సదస్సు
- విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించిన చౌటుప్పల్ ఇన్‌స్పెక్టర్ మన్మధ కుమార్
- ఉత్సాహంగా సాగిన 'రన్ ఫర్ డ్రగ్ ఫ్రీ సొసైటీ'




**తొలివెలుగు, చౌటుప్పల్:** యువత, విద్యార్థి లోకం మాదక ద్రవ్యాల (డ్రగ్స్) వంటి మహమ్మారులకు దూరంగా ఉండి, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవడం ద్వారానే ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకోగలరని చౌటుప్పల్ ఇన్‌స్పెక్టర్ జి. మన్మధ కుమార్ పేర్కొన్నారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం మండల పరిధిలోని తంగడపల్లి గ్రామంలో గల బీపీఈడీ (శారీరక విద్యా) కళాశాలలో విద్యార్థులకు 'యాంటీ డ్రగ్స్ అవగాహన కార్యక్రమం' నిర్వహించారు. చౌటుప్పల్ పోలీసుల ఆధ్వర్యంలో జరిగిన ఈ సదస్సుకు ఇన్‌స్పెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మన్మధ కుమార్ మాట్లాడుతూ.. మాదక ద్రవ్యాల వినియోగం వల్ల విద్యార్థుల శారీరక, మానసిక ఆరోగ్యం దెబ్బతినడమే కాకుండా వారి విద్యాభ్యాసం, వ్యక్తిత్వ వికాసం మరియు భవిష్యత్తుపై తీవ్ర ప్రతికూల ప్రభావం పడుతుందన్నారు. క్షణికానందం కోసం డ్రగ్స్ వైపు ఆకర్షితులై బంగారు భవిష్యత్తును అంధకారం చేసుకోవద్దని హితవు పలికారు. విద్యార్థి దశలోనే లభించే అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలే తప్ప చెడు స్నేహాలు, వ్యసనాలు, ప్రలోభాలకు లోనుకావద్దని హెచ్చరించారు.

**బాధ్యతగా సమాచారమివ్వాలి:**

మాదకద్రవ్యాల నిర్మూలన కేవలం పోలీసుల బాధ్యత మాత్రమే కాదని, సమాజంలోని ప్రతి ఒక్కరూ ఇందులో భాగస్వాములు కావాలని ఇన్‌స్పెక్టర్ పిలుపునిచ్చారు. విద్యార్థులు తమ ఇళ్లతో పాటు స్నేహితులు, సమాజంలో డ్రగ్స్ వల్ల కలిగే దుష్పరిణామాలపై నిరంతరం అవగాహన కల్పించాలన్నారు. ఎక్కడైనా మత్తు పదార్థాల విక్రయాలు సాగుతున్నా, లేదా వినియోగిస్తున్నట్లు అనుమానాస్పద సమాచారం తెలిసినా వెంటనే చౌటుప్పల్ పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు. అనంతరం డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో తమ వంతు పాత్ర పోషిస్తామని విద్యార్థులతో కలిసి ఆయన మాదకద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞ చేయించారు.

**పోస్టర్ల ప్రదర్శన - అవగాహన రన్:**

కార్యక్రమంలో భాగంగా కళాశాల ప్రాంగణంలో "రన్ ఫర్ డ్రగ్ ఫ్రీ సొసైటీ" పేరుతో ప్రత్యేక అవగాహన రన్ నిర్వహించారు. చేతుల్లో ప్లకార్డులు పట్టుకుని, డ్రగ్స్‌కు వ్యతిరేకంగా విద్యార్థులు పెద్ద పెట్టున నినాదాలు చేస్తూ పరిగెత్తారు. ఈ పరుగు యువతలో మంచి చైతన్యాన్ని నింపింది. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో ఎస్ఐ లు కనకటి యాదగిరి, అజయ్ భార్గవ్, బీపీఈడీ కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం, విద్యార్థులు, చౌటుప్పల్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



# డైరెక్షన్ మారింది!

## • దర్శకులుగా మారుతున్న యాక్టర్స్ • యాక్టర్స్‌గా స్క్రీన్‌పైకి వస్తున్న టెక్నీషియన్స్

యాక్టర్స్ డైరెక్టర్స్‌గా మారడం సినిమా ఇండస్ట్రీలో కొత్తేం కాదు. అయితే ఏదో ఐదూ పదీ సినిమాలు చేశాక డైరెక్టర్లుగా మారడం కాదు... సుదీర్ఘకాలం యాక్టర్స్‌గా కొనసాగిన కొంత మంది తమ డైరెక్షన్‌ను మార్చి, దర్శకులుగా పరిచయం అవుతున్నారు. అలాగే సాంకేతిక నిపుణులుగా సక్సెస్ అయిన కొంతమంది దర్శకులు, సంగీత దర్శకులు యాక్టర్స్‌గా పరిచయం కానున్నారు. ఇలా తమ కెరీర్‌లో కాస్త డైరెక్షన్ మార్చిన కొందరిపై మీరూ ఓ లుక్ వేయండి.

## ఇక తెరవెనక కూడా...

ఇప్పటివరకూ తెరపై యాక్టర్స్‌గా తమదైన శైలిలో నటించి, ప్రేక్షకుల మన్ననలను పొందిన కొందరు స్టార్స్ ఇప్పుడు మెగాఫోన్ పట్టారు. దర్శకులుగా తమ సత్తా చాటడానికి రెడీ అయిన ఆ యాక్టర్స్ గురించి తెలుసుకుందాం.


• విశాల్


• రవి మోహన్

### సూపర్ హీరో సాహసాలు

బాలీవుడ్‌లో 'క్రిష్' ఫ్రాంచైజీ సినిమాకు ఆడియన్స్‌లో మంచి క్రేజ్ ఉంది. ఈ సూపర్ హీరో సినిమాకు తెలుగులోనూ మంచి ఆదరణ ఉంది. ఈ 'క్రిష్' ఫ్రాంచైజీ నుంచి రానున్న తాజా చిత్రం 'క్రిష్ 4'. హృతిక్ రోషన్ హీరోగా ఈ సినిమాను రెండేళ్ల క్రితమే అధికారికంగా ప్రకటించారు. కానీ కొన్ని కారణాల వల్ల ఈ సినిమా ఇంకా సెట్స్‌కు వెళ్లలేదు. తొలుత ఈ సినిమాకు ప్రముఖ దర్శక-నిర్మాత, హృతిక్ తండ్రి రాకేష్ రోషన్ దర్శకత్వం వహించనున్నట్లుగా వార్తలు వచ్చాయి. కానీ అనారోగ్య కారణాల వల్ల ఆయన ఈ ప్రాజెక్ట్ నుంచి దర్శకుడిగా తప్పుకున్నారు. ఆ తర్వాత హృతిక్ రోషన్‌తో 'బ్యాంగ్ బ్యాంగ్, వార్' వంటి బాక్సాఫీస్ హిట్ సినిమాలను తెరకెక్కించిన దర్శకుడు సిద్ధార్థ్ ఆనంద్ పేరు 'క్రిష్ 4'కి దర్శకుడిగా వినిపించింది. కానీ ఈ చిత్రానికి తాను దర్శకత్వం వహించడం లేదని, ఓ సందర్భంలో సిద్ధార్థ్ ఆనంద్ పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో 'క్రిష్ 4' సినిమాకు తన కొడుకు హృతిక్ రోషన్ డైరెక్షన్ చేస్తాడని, ఈ సూపర్ హీరో సాహసాలను తనదైన స్టైల్లో తెరకెక్కించడానికి హృతిక్ రోషన్ సిద్ధంగా ఉన్నారని రాకేష్ రోషన్ చెప్పారు. తన 25 సంవత్సరాల సినీ కెరీర్‌లో హృతిక్ రోషన్ దర్శకత్వం వహించనున్న తొలి సినిమా ఇదే కావడం విశేషం. యశ్‌రాజ్ ఫిలింస్ పతాకంపై ఆదిత్య చోప్రా ఈ 'క్రిష్ 4' సినిమాను నిర్మించనున్నారని బాలీవుడ్ సమాచారం. కాగా, హృతిక్ రోషన్-నిర్మాత ఆదిత్య చోప్రా కాంబినేషన్‌లో ఇటీవల వచ్చిన 'వార్ 2' చిత్రం బాక్సాఫీస్ వద్ద విఫలమైంది. దీంతో ఈ ప్రభావం 'క్రిష్ 4' చిత్రంపై పడే అవకాశం ఉందని, దీంతో 'క్రిష్ 4' సినిమా సెట్స్‌కు వెళ్లడానికి మరికొంత సమయం పడుతుందనే టాక్ బాలీవుడ్ సినీ సర్కిల్స్‌లో వినిపిస్తోంది.

### మకుటం

రెండు దశాబ్దాలుగా యాక్టర్‌గా ఇండస్ట్రీలో రాణిస్తూ, తన సత్తా చాటుకుంటున్నారు హీరో విశాల్. ఇప్పుడు దర్శకుడిగా విశాల్ తొలిసారిగా మెగాఫోన్ పట్టారు. విశాల్ హీరోగా నటిస్తున్న తమిళ చిత్రం 'మగుడం'. ఈ సినిమాకు తెలుగులో 'మకుటం' అనే టైటిల్ ఖరారు చేశారు. స్టంట్ కొరియోగ్రాఫర్ రవి అరసు దర్శకుడిగా ఈ సినిమా చిత్రీకరణ ప్రారంభమైంది. కానీ విశాల్‌కు, రవి అరసుకు మధ్య క్రియేటివ్ డిఫరెన్సెస్ రావడంతో ఈ సినిమా దర్శకత్వ బాధ్యతలను కూడా స్వీకరించారు విశాల్. కొన్ని అనివార్య పరిస్థితుల కారణంగా 'మకుటం' సినిమాకు దర్శకత్వం వహించాల్సి వచ్చిందని, ఈ విషయాన్ని సీక్రెట్‌గా ఉంచాల్సిన అవసరం లేదని ఇటీవల విశాల్ పేర్కొన్నారు. అలాగే తాను తొలిసారిగా దర్శకత్వం వహిస్తున్నందుకు చాలా సంతోషంగా ఉందని తెలిపారు విశాల్. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ చెన్నైలో జరుగుతోంది. భారీ స్థాయిలో క్లైమాక్స్ ఎపిసోడ్‌ను చిత్రీకరిస్తున్నారని సమాచారం. ఈ చిత్రంలో కృపాకర్ అనే పాత్రలో విశాల్ కనిపిస్తారట. ఇంకా ఈ చిత్రంలో దుషారా విజయన్, అంజలి, తంబి రామయ్య ఇతర ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. సూపర్‌గుడ్ ఫిల్మ్స్ పతాకంపై ఆర్‌బీ చౌదరి 'మకుటం'ను నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో విశాల్ క్యారెక్టరైజేషన్‌లో డిఫరెంట్ షేడ్స్ ఉంటాయని తెలిసింది. ఈ చిత్రంలో విశాల్ మూడు గెటప్స్‌లో కనిపించనున్నారు. సముద్ర తీరం, అక్కడి వ్యాపారం, తీర ప్రాంతాల్లో జరిగే అక్రమాలు, మాఫియా వంటి అంశాల నేపథ్యంలో 'మకుటం' కథ సాగుతుందని కోలీవుడ్ టాక్. ఈ సంగతి ఇలా ఉంచితే... విశాల్ కెరీర్‌లో వన్నాఫ్ ది బిగ్గెస్ట్ హిట్స్ అయిన 'డిటెక్టివ్' చిత్రానికి 'మిస్కిన్' దర్శకత్వం వహించారు. ఆ తర్వాత 'డిటెక్టివ్' సినిమాకు సీక్వెల్‌గా 'డిటెక్టివ్ 2' చిత్రాన్ని కూడా ప్రకటించారు. కానీ మిస్కిన్‌తో విశాల్‌కు క్రియేటివ్ డిఫరెన్సెస్ రావడంతో 'డిటెక్టివ్ 2' సినిమాకు తానే దర్శకత్వం వహించనున్నట్లుగా గతంలో ప్రకటించారు. విశాల్ దర్శకత్వం వహించే తొలి సినిమా ఇదే అవుతుందని అందరూ ఊహించారు. కానీ ఇప్పుడు 'మకుటం'తో విశాల్ దర్శకుడిగా పరిచయం కానున్నారు. మరి... 'డిటెక్టివ్ 2' చిత్రం కూడా విశాల్ డైరెక్షన్‌లోనే సెట్స్‌కు వెళ్తుందా? లెట్స్ వెయిట్ అండ్ సీ.


• నేహా శర్మ

### సరస్వతి

నటిగా వరలక్ష్మీ శరత్‌కుమార్ గురించి ప్రత్యేకించి చెప్పక్కర్లేదు. 'క్రాక్, నాంది, హనుమాన్, యశోద' వంటి స్ట్రయిట్ తెలుగు సినిమాలు కూడా చేశారామె. కథ ప్రకారం కొన్నిసార్లు క్యారెక్టర్ ఆర్టిస్టుగా కనిపిస్తే, ఇంకొన్నిసార్లు విలన్‌గా మెప్పించారు. అయితే వరలక్ష్మీ శరత్‌కుమార్ తన సినీ కెరీర్‌లో మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. 'సరస్వతి' సినిమాతో తాను దర్శకురాలిగా మారుతున్నట్లుగా వరలక్ష్మీ శరత్‌కుమార్ ఇటీవల ప్రకటించారు. ఈ థ్రిల్లర్ సినిమాలో ప్రియమణి, నవీన్‌చంద్ర, ప్రకాశ్‌రాజ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. వరలక్ష్మీ శరత్‌కుమార్ కూడా ఓ కీలక పాత్రలో నటించనున్నట్లుగా తెలిసింది. ఈ సినిమాను తెలుగు, తమిళ భాషలతో పాటు హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో కూడా పాన్ ఇండియా స్థాయిలో రిలీజ్ చేయాలని ప్లాన్ చేశారు వరలక్ష్మీ శరత్‌కుమార్. తన సోదరి పూజా శరత్‌కుమార్‌తో కలిసి దోశ డైరీస్ పతాకంపై 'సరస్వతి' సినిమాను నిర్మిస్తున్నారామె. ఈ సినిమాకు తమన్ సంగీతం అందించనున్నారు. ఈ సంగతి ఇలా ఉంచితే... గతంలో 'కన్నామూచ్చి' అనే సినిమాతో వరలక్ష్మీ శరత్‌కుమార్ దర్శకురాలిగా మారతారన్న వార్తలు వచ్చాయి. కానీ ఈ చిత్రం పూర్తి స్థాయిలో సెట్స్‌కు వెళ్లలేదన్న వార్తలు ఉన్నాయి.

### పీరియాడికల్ డ్రామా

రామ్‌చరణ్ హీరోగా పరిచయం అయిన 'చిరుత' సినిమాలో హీరోయిన్‌గా నటించిన నేహా శర్మ గుర్తుండే ఉంటారు. ఈ సినిమా తర్వాత నేహా శర్మ హిందీ, పంజాబీల్లో హీరోయిన్‌గా సినిమాలు చేశారు. ఇటీవల నాని హీరోగా నటించిన 'హాయ్ నాన్న' చిత్రంలో ఓ మోడల్‌గా గెస్ట్ రోల్ చేశారు నేహా. ఆమె దర్శకురాలిగా పరిచయం కానున్నారని టాక్. 1945 నేపథ్యంలో సాగే ఈ చిత్రంలో సిద్ధాంత్ చతుర్వేది హీరోగా నటిస్తారని, మోహిత్ కీలక పాత్రలో నటించనున్నారని సమాచారం. అంతేకాదు... ఈ సినిమాను అజయ్ దేవగన్ నిర్మించనున్నారని టాక్. వచ్చే ఏడాది ఈ సినిమా విడుదల కానుందని తెలిసింది.


• వరలక్ష్మీ శరత్‌కుమార్

### ఆర్డినరీ మ్యాన్

ఇండస్ట్రీలో హీరోగా ఇరవై సంవత్సరాల సక్సెస్‌ఫుల్ కెరీర్‌ను పూర్తి చేసుకున్న తర్వాత రవి మోహన్ ('జయం' రవి) ఇటీవల రవి మోహన్ స్టూడియోస్ అనే నిర్మాణ సంస్థను ప్రారంభించారు. ఈ రవి మోహన్ స్టూడియోస్‌లో సినిమాలు, ఓటీటీ ప్రాజెక్ట్స్‌ను తెరకెక్కించనున్నట్లుగా ఆయన తెలిపారు. అంతే కాదు... తన నిర్మాణ సంస్థలోని 'యాన్ ఆర్డినరీ మ్యాన్' చిత్రంతో దర్శకుడిగా మారారు రవి మోహన్. ఈ హీరోకి దర్శకుడిగా ఇదే తొలి చిత్రం కావడం విశేషం. ఈ సినిమాలో యోగిబాబు లీడ్ రోల్‌లో నటిస్తారు. రవి మోహన్ కూడా ఓ కీలక పాత్రలో నటించనున్నారనే టాక్ కోలీవుడ్‌లో వినిపిస్తోంది. ఒక ఆర్డినరీ మ్యాన్ లైఫ్ ఎలా ఉంటుంది? అన్నదే ఈ సినిమా ప్రధాన కథాంశమని సమాచారం.

**వీరే కాదు... మరికొందరు హీరోలు, హీరోయిన్లు దర్శకులుగా మారేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని టాక్. మరోవైపు ఈ ఏడాది విడుదలైన 'ఫతే' చిత్రంతో సోనూ సూద్, 'ది మెహతా బాయ్స్' చిత్రంతో బొమన్ ఇరానీ వంటి ప్రముఖ నటులు ఆల్రెడీ దర్శకులుగా పరిచయం అయిన సంగతి తెలిసిందే.**

### థ్రిల్లర్ రెడీ


• ఐశ్వర్య, అర్జున్

అర్జున్, ఐశ్వర్యా రాజేశ్ లీడ్ రోల్స్‌లో నటించిన చిత్రం 'మఫ్టీ పోలీస్'. దినేష్ లెట్చుమనన్ దర్శకత్వంలో జి. అరుల్ కుమార్ సమర్పణలో జి.ఎస్. ఆర్ట్స్ సంస్థ ఈ సినిమాను నిర్మించింది. ఈ థ్రిల్లర్ సినిమా ఈ నెల 21న విడుదల కానుంది. తమిళ, తెలుగు, మలయాళ, కన్నడ భాషలలో ఒకేసారి ఈ సినిమాను రిలీజ్ చేస్తున్నట్లుగా చిత్రబృందం పేర్కొంది.

### క్రిస్మస్‌కి వృషభ


• మోహన్ లాల్

మోహన్ లాల్ లీడ్ రోల్‌లో నటించిన చిత్రం 'వృషభ'. తండ్రీ కొడుకుల మధ్య గాఢమైన అనుబంధాన్ని ఆవిష్కరిస్తూ ప్రేమ, విధి, ద్వేషం వంటి భావోద్వేగాలను మిళితం చేసి నందకిశోర్ ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు. శోభా కపూర్, ఏక్తా ఆర్. కపూర్, సీకే పద్మకుమార్, వరుణ్ మాథుర్, సౌరభ్ మిశ్రా, అభిషేక్ ఎస్. వ్యాస్, ప్రవీర్ సింగ్, విశాల్ గుర్నని, జుహి పరేఖ్ మెహతా నిర్మించారు. ఈ చిత్రం క్రిస్మస్ సందర్భంగా డిసెంబర్ 25న విడుదల కానుంది. సమర్జిత్ లంకేష్, రాగిణి ద్వివేది, నయన్ సారిక, అజయ్, నేహా సక్సేనా కీలక పాత్రలు పోషించిన ఈ సినిమాని మలయాళం, తెలుగులో ఏక కాలంలో చిత్రీకరించారు. ఈ రెండు భాషలతో పాటు హిందీ, కన్నడలోనూ విడుదల చేయనున్నారు.


• హృతిక్ రోషన్


• దేవిశ్రీ ప్రసాద్

## ఇక తెరపైకి కూడా...

**ఇప్పటివరకూ తెరవెనక టెక్నీషియన్లుగా తమ ప్రతిభ చాటుకున్న సాంకేతిక నిపుణులు కొందరు ఇప్పుడు తెరపై నటులుగా కనిపించడానికి రెడీ అయ్యారు. వీరిలో కొందరు ఇంతకుముందు ఒకట్రెండు కీలక పాత్రల్లో కనిపించారు. ఇప్పుడు మాత్రం హీరోలుగా కొందరు, లెంగ్తీ రోల్స్‌లో కొందరు కనిపించనున్నారు. ఆ విశేషాలు...**

### ఎల్లమ్మలో...

రెండు దశాబ్దాలకు పైగా ఇండస్ట్రీలో సంగీత దర్శకుడిగా రాణిస్తున్నారు దేవిశ్రీ ప్రసాద్. కొన్ని పాటల్లో గెస్ట్ అప్పియరెన్స్ కూడా ఇచ్చారు. కానీ ఇప్పుడు పూర్తి స్థాయిలో యాక్టర్‌గా వెండితెరపై కనిపించనున్నారట దేవిశ్రీ ప్రసాద్. 'బలంగం' వంటి సూపర్ హిట్ చిత్రం తర్వాత వేణు యెల్దండి రూరల్ బ్యాక్‌డ్రాప్‌లో 'ఎల్లమ్మ' అనే సినిమా చేయనున్నారు. ఈ చిత్రంలో హీరోలంటూ నాని, నితిన్, శర్వానంద్ వంటి వార్ల పేర్లు వినిపించాయి. కానీ ఫైనల్‌గా ఈ చాన్స్ దేవిశ్రీ ప్రసాద్‌కు లభించిందట. ఈ 'ఎల్లమ్మ' చిత్రంలో దేవిశ్రీ ప్రసాద్ హీరోగా నటిస్తారని, హీరోయిన్‌గా కీర్తీ సురేష్ కనిపిస్తారనే టాక్ ఫిల్మ్‌నగర్ సర్కిల్స్‌లో వినిపిస్తోంది. 'దిల్' రాజు ఈ సినిమాను నిర్మించనున్నారట. వచ్చే ఏడాది ఈ సినిమా షూటింగ్‌ను ప్రారంభించాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారని తెలిసింది. అలాగే ఈ సినిమాకు తొలుత తమిళ సంగీత దర్శక ద్వయం వివేక్-మెర్విన్‌లు స్వరాలు సమకూర్చనున్నారనే టాక్ తెరపైకి వచ్చింది. కానీ హీరోగా నటించడంతో పాటు ఈ చిత్రానికి దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందించనున్నారనే టాక్ కూడా తాజాగా తెరపైకి వచ్చింది. ఈ విషయాలపై అధికారిక సమాచారం అందాల్సి ఉంది.


• తమన్

### మళ్లీ యాక్టర్‌గా...

సంగీత దర్శకుడిగా తమన్ ఎంత బిజీగా ఉంటారో ప్రత్యేకించి చెప్పక్కర్లేదు. ఈ బిజీ టైమ్‌లోనూ యాక్టర్‌గా తమన్ ఓ సినిమా చేస్తున్నారు. అదే 'ఇదయమ్ మురళి' మూవీ. అథర్వ మురళి ఈ చిత్రంలో హీరోగా నటిస్తున్నారు. కయాదు లోహర్, ప్రీతి ముకుందన్ హీరోయిన్స్‌గా నటిస్తుండగా తమన్, నిహారిక ఎన్ఎమ్, ప్రగ్య కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఆకాశ్ భాస్కరన్ ఈ సినిమాకు దర్శకుడు. ఆల్రెడీ 'ఇదయమ్ మురళి' సినిమాను ప్రకటించారు. షూటింగ్ కూడా మొదలైంది. మేజర్ షూటింగ్ విదేశాల్లో జరుగుతోంది. వచ్చే ఏడాది ప్రేమికుల దినోత్సవానికి ఈ సినిమా విడుదల కానుందనే టాక్ వినిపిస్తోంది. ఇక యాక్టర్‌గా తమన్‌కు ఇది తొలి చిత్రం కాదు. ఆ మాటకొస్తే... తమన్ కెరీర్ యాక్టర్‌గానే మొదలైంది. 2003లో శంకర్ దర్శకత్వంలో వచ్చిన 'బాయ్స్' చిత్రంలో తమన్ ఓ కీలక పాత్రలో నటించారు. ఆ తర్వాత గెస్ట్ రోల్స్‌లో కనిపించినా కొంత గ్యాప్ తర్వాత తమన్ కీలక పాత్రలో నటిస్తున్నది మాత్రం 'ఇదయమ్ మురళి' సినిమాలోనే. మరో విశేషం ఏంటంటే... ఈ సినిమాకు తమన్ సంగీతం కూడా అందిస్తున్నారు.

### ప్రేమకథ

అడివి శేష్ హీరోగా నటిస్తున్న 'డెకాయిట్' చిత్రంతో సినిమాటోగ్రాఫర్ షానియల్ డియో దర్శకుడిగా మారారు. గతంలో అడివి శేష్ హీరోగా నటించిన 'క్షణం, గూఢచారి' వంటి సినిమాలకు షానియల్ సినిమాటోగ్రాఫర్‌గా వర్క్ చేశారు. ప్రేమ, ప్రతీకారం నేపథ్యంలో రూపొందుతున్న 'డెకాయిట్' సినిమాలో మృణాల్ ఠాకూర్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. అనురాగ్ కశ్యప్ కీలక పాత్రలో కనిపిస్తారు. సుప్రియ యార్లగడ్డ, సునీల్ నారంగ్ నిర్మిస్తున్న ఈ సినిమా 2026 మార్చి 19న విడుదల కానుంది.


• షానియల్ డియో

### యాక్షన్ డ్రామా

'కల్కి 2898 ఏడీ, కేజీఎఫ్, ఖైదీ, అమరన్..' వంటి బ్లాక్‌బస్టర్ సినిమాలకు స్టంట్ కొరియోగ్రాఫర్స్‌గా పని చేసిన అన్బు-అరివులు దర్శకులుగా మారారు. ఈ చిత్రంలో కమల్‌హాసన్ హీరోగా నటించనున్నారు. 2024లోనే ఈ సినిమాను అధికారికంగా ప్రకటించారు. త్వరలో ఈ సినిమా చిత్రీకరణ ప్రారంభం కానుంది. పూర్తి స్థాయి యాక్షన్ డ్రామాగా ఈ చిత్రం తెరకెక్కనుంది.

### ఎల్‌యూసీలో డీసీ?

'మా నగరం' సినిమాతో దర్శకుడిగా పాపులర్ అయ్యారు లోకేశ్ కనగరాజ్. నెక్ట్స్ మూవీ 'ఖైదీ' బ్లాక్ బస్టర్ కావడంతో లోకేశ్ తమిళ చిత్ర పరిశ్రమలో స్టార్ డైరెక్టర్ అయ్యారు. ఈ స్టార్ హోదాకు తగ్గట్లే లోకేశ్ కనగరాజ్‌కు కమల్ హాసన్‌తో 'విక్రమ్', రజనీకాంత్‌తో 'కూలీ', విజయ్‌తో 'లియో, మాస్టర్' వంటి చిత్రాలను తెరకెక్కించే చాన్స్ దక్కింది. స్టార్ హీరోలతో సినిమాలు చేసిన ఈ తమిళ స్టార్ డైరెక్టర్ నిర్మాతగా కూడా సినిమాలు చేస్తున్నారు. రైటర్‌గానూ చేస్తున్నారు. ఇదే స్పీడ్‌లో హీరోగానూ సత్తా చాటాలని నిర్ణయించుకుని, 'డీసీ' అనే మూవీని స్టార్ట్ చేశారు లోకేశ్. గతంలో ఒకట్రెండు సినిమాల్లో గెస్ట్ రోల్‌లో, ఓ మ్యూజిక్ వీడియోలో లోకేశ్ యాక్టర్‌గా కనిపించినా, 'డీసీ'లో మాత్రం పూర్తి స్థాయిలో హీరోగా నటిస్తున్నారు. ధనుష్‌తో 'కెప్టెన్ మిల్లర్' తీసిన దర్శకుడు అరుణ్ మాథేశ్వరన్ ఈ 'డీసీ' సినిమాకు దర్శకత్వం వహిస్తుండగా బాలీవుడ్ హీరోయిన్ వామికా గబ్బి హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఈ చిత్రంలో దేవ దాస్‌గా లోకేశ్, చంద్రగా వామిక నటిస్తున్నారు. ఈ గ్యాంగ్‌స్టర్ డ్రామాను సన్ పిక్చర్స్ సంస్థ నిర్మిస్తోంది. ఈ సినిమాను వచ్చే ఏడాది వేసవిలో రిలీజ్ చేయనున్నట్లుగా ఆల్రెడీ మేకర్స్ ప్రకటించారు. మరోవైపు డైరెక్టర్‌గా లోకేశ్ సినిమాటిక్ యూనివర్స్ (ఎల్‌యూసీ) పేరిట సినిమాలు చేస్తున్న సంగతి తెలిసిందే. 'ఖైదీ, విక్రమ్, లియో' వంటివి 'ఎల్‌యూసీ'లో భాగమైన చిత్రాలే. ఈ 'డీసీ' కూడా 'ఎల్‌యూసీ'లోని చిత్రమే అన్నట్లుగా ఓ టాక్ తెరపైకి వచ్చింది. మరి... 'ఎల్‌యూసీ'లో 'డీసీ' భాగం అవుతుందా? లెట్స్ వెయిట్ అండ్ సీ.


• కమల్‌హాసన్‌తో అన్బరివ్


• లోకేశ్ కనగరాజ్

### మిస్టర్ సత్య

తమిళ సూపర్ డూపర్ హిట్ ఫిల్మ్ 'టూరిస్ట్ ఫ్యామిలీ' దర్శకుడు అభిషాన్ జీవంత్ హీరోగా ఓ సినిమా తెరకెక్కుతోంది. 'టూరిస్ట్ ఫ్యామిలీ'లో అభిషాన్ నటించినప్పటికీ ఈ చిత్రంలో తనది కీలక పాత్ర మాత్రమే. కాగా అభిషాన్ ఫుల్ లెంగ్త్ హీరోగా ఓ సినిమా రూపొందుతోంది. ఆల్రెడీ ఈ సినిమాను అధికారికంగా ప్రకటించారు మేకర్స్. ఇంకా టైటిల్ ఖరారు కాని ఈ చిత్రంలో సత్య అనే పాత్రలో నటిస్తున్నారు అభిషాన్. ఈ చిత్రంలో మలయాళ నటి అనస్వర రాజన్ హీరోయిన్‌గా నటిస్తున్నారని తెలిసింది. ఈ రొమాంటిక్ కామెడీ సినిమాకు రజనీకాంత్ కుమార్తె సౌందర్య రజనీకాంత్ ఓ నిర్మాతగా ఉన్నారు. ఈ సినిమాను కేవలం 45 రోజుల్లోనే చిత్రీకరించారట మేకర్స్. ఈ సినిమా వచ్చే ఏడాది థియేటర్స్‌లో రిలీజ్ కానుందట. ప్రేమికుల రోజు సందర్భంగా రిలీజ్ చేయాలనుకుంటున్నారని సమాచారం.


• అభిషాన్ జీవంత్

ఇలా... దర్శకులుగా మారుతున్న టెక్నీషియన్స్ మరికొంతమంది ఉన్నారు.